

నడిరోడ్డుపై వివాహిత హత్య

- ఎదురింట్లో ఉండే వ్యక్తి ఘాతుకం
- విచక్షణ కోల్పోయి పదునైన ఆయుధంతో పీక కోసేసిన నిందితుడు
- విశాఖ అక్కయ్యపాలెంలో ఘటన -8లో

మన్యంపై మంచు దుప్పటి

- శీతాకాలాన్ని తలపించేలా దట్టంగా పొగమంచు

శీతాకాలాన్ని తలపించేలా జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం దట్టంగా పొగమంచు కుమ్ము కుంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తెల్ల వారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు అదే వాతావరణం నెలకొనడంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాయి. అయితే తాజా పొగమంచుతో మన్యంలోని ప్రకృతి అందాలు మరింత సుందరంగా దర్శనమిస్తున్నాయి.

-పాడేరు/ఆంధ్రజ్యోతి



మంచు ముసుగులో పాడేరు అంబేడ్కర్ సెంటర్

బంతిపూల విక్రయాల జోరు

- ప్రస్తుతం బుట్ట పూలు రూ.200
- దీపావళి, కార్తీక మాసం సమీపిస్తుండడంతో ధర పెరిగే అవకాశం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో బంతి పూల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రం పాడేరులోని పాతబస్టాండ్ ఆవరణలో గిరిజన రైతుల వద్ద వర్తకులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో బుట్ట పూలు రూ.200 వరకు విక్రయిస్తున్నారు. దీపావళి, కార్తీకమాసంలో వీటి ధర మరింత పెరుగుతుందని రైతులు అంటున్నారు.

పాడేరు మండలంతో పాటు ఆనుకుని ఉన్న హుకుంపేట, జి.మాడుగుల మండలాలకు చెందిన గిరిజన రైతులు ప్రతి ఏడాది బంతి పూలను సాగు చేస్తుంటారు. అక్టోబరు రెండో వారం నుంచి దాదాపుగా డిసెంబరు మొదటి వారం వరకు పాడేరులో బంతి పూల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అలాగే సీజన్ ప్రారంభంలో పది కిలోలుండే బుట్ట పూలు రూ.150 నుంచి రూ.200కు వర్తకులు కొనుగోలు చేస్తుంటారు. అయితే పండుగ సీజన్‌లో రెట్టింపు కావడం, సీజన్ ముగిసే నాటికి అదే బుట్ట పూలు రూ.50 నుంచి రూ.100కు ధర దిగజారడం సర్వసాధారణం. అనకాపల్లి, నర్సీపట్నం, తుని, కాకినాడ ప్రాంతాలకు చెందిన వర్తకులు వచ్చి గిరిజన రైతుల వద్ద బంతి పూలు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వర్తకులు వస్తే ధర రెండింతలు పెరుగుతుందని రైతులు అంటున్నారు.

బంతి పూలకు భలే డిమాండ్

ఏజెన్సీలో సహజసిద్ధంగా సాగు చేసే బంతి పూలకు ఇతర ప్రాంతాల్లో చాలా డిమాండ్ ఉంది. ఎందుకంటే ఇతర ప్రాంతాల్లో పూలు కోసిన రెండు, మూడు రోజుల్లో వాడిపోతాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని కొనుగోలు చేసిన పూలను ఇతర ప్రాంతాల్లోని మార్కెట్‌లకు సకాలంలో రవాణా చేయకపోతే వర్తకులు నష్టపోయే ప్రమాదముంది. అదే ఏజెన్సీలోని పూలు అయితే కోసిన వారం రోజులకు గాని వాడిపోవు. అందు వలన ఇక్కడ కొనుగోలు చేసిన పూలను ఎక్కడికైనా రవాణా చేసుకోవచ్చుననే ధీమాతో వర్తకులు వాటిని కొనుగోలుకు ఎగబడుతుంటారు.





పాడేరులో బంతి పూలు విక్రయిస్తున్న గిరి మహిళలు, పక్కన పాడేరు మార్కెట్‌కు కావిడతో బంతిపూలు తీసుకువస్తున్న గిరి రైతు

కాఫీ యూనిట్‌కు కదలిక ఏదీ?

- రెండేళ్ల క్రితం అట్టహాసంగా సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన
- నిధులు విడుదల చేయని గత వైసీపీ ప్రభుత్వం
- పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన పనులు

కొయ్యూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

మండలంలో డౌనూరు కేంద్రంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ గత రెండేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది. 2023 అక్టోబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అప్పట్లో గొప్పలు చెప్పారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో పునాదుల స్థాయిలోనే నిర్మాణం నిలిచిపోయింది.

మండలంలో డౌనూరు కేంద్రంగా కాఫీ క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, అలాగే ప్యాకింగ్ చేసేందుకు గాను రూ.4 కోట్లతో సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి 2023 అక్టోబరు 20న అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి శంకుస్థాపన చేశారు. గిరిజన రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఈ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని, ఆరు నెలల్లో దీన్ని అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో పిల్లర్ల స్థాయిలోనే నిర్మాణం నిలిచిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కదలిక లేదు. ఈ యూనిట్ అందుబాటులోకి వచ్చి ఉంటే కాఫీ రైతులు దళారుల బారిన పడకుండా నేరుగా జీసీసీకి అమ్మకాలు జరిపి లాభాలు ఆర్జించేవారు. అంతేకాకుండా స్థానిక మహిళలకు ఉపాధి కూడా దొరికేది. అయితే గత పాలకుల నిర్లక్ష్యం వలన ఇది కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ యూనిట్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.





సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించిన స్థలంలో పిల్లర్ల స్థాయి దాటని నిర్మాణాలు. (ఇన్‌సెట్లో) గత ప్రభుత్వ హయాంలో అప్పటి గిరిజన సంక్షేమ శాఖా మంత్రి ఆవిష్కరించిన శిలాఫలకం

ఇటొస్తే కూరుకుపోయినట్టే..

- అధ్వానంగా కొమ్మిక రహదారి
- బురదమయంగా ఉండడంతో దిగబడిపోయిన లారీ
- మూడు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

కొయ్యూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల కురిసిన వర్షాలకు కొమ్మిక వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రైతులకు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే యూరియా లోడుతో బుధవారం ఈ మార్గంలో వస్తున్న లారీ బురదలో కూరుకుపోయింది. దీనిని బయటకు తీయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

కృష్ణాదేవిపేట నుంచి కొమ్మిక వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. కొంగసింగి దాటాక సుమారు రెండు కిలోమీటర్లు, ఘాట్ రోడ్డు దిగగానే డేగలపాలెం కూడలి నుంచి కొమ్మిక వరకు మూడు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఈ రహదారిని నిర్మించి రెండు దశాబ్దాలు కావస్తున్నా కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

కాగా బుధవారం యూరియా లోడుతో వెళుతున్న లారీ బురదలో కూరుకుపోవడంతో కొమ్మిక సచివాలయ పరిధిలోని రైతులు మూడు గంటల పాటు శ్రమించి ఆ లారీని బయటకు తీశారు. అప్పటి వరకు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



కొమ్మిక వెళ్లే మార్గంలో బురదలో కూరుకుపోయిన లారీని నెడుతున్న దృశ్యం

బధిరులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాలి

- ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ

పాడేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

బధిరులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో అవకాశం ఉందని, అందుకు మరింత కృషి జరగాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ అన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ బుధవారం నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినికిడి లోపం కలిగిన వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడం ఎంతైనా అవసరమన్నారు. వారికి ప్రత్యేక సైన్ లాంగ్వేజ్ ఉంటుందన్నారు. వాళ్లు ఉపయోగించే సైన్ లాంగ్వేజ్ సైతం ఒక నాట్యం వంటిదేనని, పూర్వం భరతనాట్యంలో ఎటువంటి మాటలు లేకుండా కేవలం ముఖ కవళికలు, చేతులతో చేసే సంజ్ఞల ద్వారా మాత్రమే భావాలను పలికించేవారన్నారు. మహాభారతం, రామాయణం వంటి కథాంశాలను సైతం కేవలం సంజ్ఞల ద్వారా తెలిపేవారన్నారు. వినికిడి లోపం ఉన్న సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ అభినయ సినీ రంగంలో ఎంతగానో రాణిస్తున్నారని ఉదాహరణగా పేర్కొన్నారు. అలాగే అనేక కార్పొరేట్ వ్యాపార సంస్థల్లో సైతం బధిరులు ఉద్యోగాలు చేస్తూ రాణిస్తున్నారని, అలాగే ఇతర అనేక కార్యకలాపాల్లో సైతం వారి పాత్ర ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, దివ్యాంగుల శాఖ ఏడీ కవిత, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ డప్పోడి వెంకటరమణ, మాజీ ఎంపీపీ బొర్రా విజయ రాణి, సర్పంచ్ లకే పార్వతమ్మ, రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎస్.గంగరాజు, సభ్యురాలు వి.జయ, అధిక సంఖ్యలో బధిరులు పాల్గొన్నారు.



బధిరుల సైన్ లాంగ్వేజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో శ్రీపూజ. అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, తదితరులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

ఎస్పీ అమిత్‌బర్దార్ హెచ్చరిక

- 17న మహాధర్నాకు అనుమతి లేదని వెల్లడి

పాడేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరిట అనవసరపు ఆందోళనలు చేపట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ అమిత్‌బర్దార్ హెచ్చరించారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశాలతో కలెక్టర్ దినేశ్‌కుమార్‌తో కలిసి అరకులోయ గిరిజన నేతలతో తాము సమావేశం నిర్వహించి హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన అనేక విషయాలను తెలిపామన్నారు. ప్రధానంగా స్థానిక గిరిజనుల ఆమోదం లేకుండా ఎటువంటి చర్యలు చేపట్టబోమన్నారు. అలాగే ప్రస్తుతం అక్కడ ఎటువంటి పనులు జరగడం లేదని, అయినప్పటికీ ఆందోళనలు, నిరసనలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ నెల 17న పాడేరులో తలపెట్టిన మహాధర్నాకు ఎటువంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ క్రమంలో మహాధర్నా పేరిట ప్రజలను రెచ్చగొట్టడం వంటి శాంతిభద్రల సమస్యలు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దు

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో తాజా పరిస్థితుల నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్దార్

కదంతొక్కిన పోలవరం నిర్వాసితులు

- ఏటా వరదల్లో ఈ బాధలు పడలేమని ఆవేదన
- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం చెల్లించాలని డిమాండ్
- ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ముట్టడి
- స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టు
- ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని కలెక్టర్ హామీ

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

విలీన మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఒక్కటయ్యారు. ముంపు గ్రామాలన్నింటికీ 2013 భూసేకరణ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని లోతట్టువాసులు బుధవారం ర్యాలీగా తరలివచ్చి చింతూరు ఐటీడీఏని ముట్టడించారు. విలీన మండలాలైన మల్లెతోట, గుర్రంపేట, రామవరం, తదితర గ్రామాల నిర్వాసితులు ర్యాలీగా పెద్దసంఖ్యలో వచ్చారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తాము ఏటా పడుతున్న వెతలు ఏకరువు పెట్టారు. ఈ కష్టాలు తాము భరించలేకపోతున్నామని, తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారంతా నిరసన తెలిపారు. వరదల సమయంలో రోజుల తరబడి జల దిగ్బంధంలో చిక్కుకుని తిండికి నోచుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్ల చుట్టూ వరద నీరు ఉండడంతో ఆ సమయంలో రోగమొచ్చినా ఆస్పత్రికి వెళ్లే దిక్కు లేకుండాపోతుందని చెప్పుకున్నారు. ముంపు గ్రామాలన్నింటినీ గుర్తించి 2013 భూసేకరణ మేరకు నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం, పునరావాసంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో రూ.1.15 లక్షల పరిహారం తీసుకున్న భూములకు కూడా 2013 భూసేకరణ వర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నిర్వాసితులు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ అధికారిక కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వాసితులతో మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూస్తున్నామని, ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఇప్పటి వరకు ప్రకటించిన ముంపు గ్రామాల కంటే అదనంగా మరికొన్ని గ్రామాలు కూడా ముంపునకు గురవుతున్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. అందరికీ న్యాయం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.





ఐటీడీఏని ముట్టడించిన నిర్వాసితులు. (ఇన్‌సెట్లో) కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

శిశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

» వైద్యాధికారి రాజేశ్వరి



శిశువుకు వ్యాక్సినేషన్ వేస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి

జి.మాడుగుల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శిశువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని వైద్య అధికారి రాజేశ్వరి సూచించారు. మండలంలోని వి.కొత్తూరు గ్రామంలో చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, అప్పుడే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని స్పష్టం చేశారు. అలాగే శిశువుకు పాలు పట్టించే సమయంలో తల్లి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వి.రత్నకుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిరి శిఖర గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

అనంతగిరి: మండలంలోని పినకోట పీహెచ్‌సీ పరిధి గుమ్మంతి, దాయర్తి, మద్రేబ్ గ్రామాల్లో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించారు. వైద్యాధికారి వెంకటేశ్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి, మూడు గ్రామాల్లో 67 మందికి పరీక్షలు నిర్వహించగా 18 మందికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా వారికి మందులు పంపిణీ చేశామని, పలు సూచనలు చేశామని తెలిపారు. అనంతరం రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు

చిరుధాన్యాల సాగుపై అవగాహన

జి.మాడుగుల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చిరుచిరుధాన్యాల సాగుకు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఐఐఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్త డా. సంగప్ప, డా.రఫీ రైతులకు సూచించారు. సొలంభం పంచాయతీ భీమలోయ గ్రామంలో మత్స్యదేవత ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగును వారు బుధవారం పిరశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో, సీఈవో ఐసారం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దిగరువులో ఉచిత వైద్యశిబిరం

జి.మాడుగుల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిగరువులో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ షణ్ముఖరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి వ్యాధులకైనా ఉచితంగా పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్‌లోని రెండు మండలాల్లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పాడేరు ఈఈ పి.వేణుగోపాల్ తెలపారు. అలాగే జి.మాడుగుల సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫీడర్ మరమ్మతుల చేపడుతున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బొకెళ్ల, ఇరడాపల్లి, డోకులూరు, కించూరు పంచాయతీ గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.త

'రేషన్ తూకం సక్రమంగా ఉండాలి'



తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సేల్స్‌మేన్‌లు

చింతపల్లి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : చింతపల్లి మండల స్థాయి నిల్వ కేంద్రం నుంచి రేషన్ సరకులను సరైన తూకం వేయించి పంపేలా చర్యలు తీసుకోవాలని డీటీపీ మండల అధ్యక్షుడు కిలోల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సేల్స్‌మేన్‌లు తహశీల్దార్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని డీఆర్ డిపోలను ఆన్‌లైన్ చేశారని, అయితే మండలస్థాయి నిల్వ కేంద్రం వద్ద నుంచి సరకులు మాత్రం తక్కువ తూకంతో రావడం వల్ల స్టాకులో వ్యత్యాసం వస్తోందని పేర్కొన్నారు. ఈ విధమైన సమస్యలతో ఆన్‌లైన్‌లో డిపోలను నడపడం చాలా కష్టంగా అవుతోందని, ఈ స్టాకు వ్యత్యాసానికి సంబంధించిన భారం అంతా సేల్స్‌మేన్‌లపై పడుతోందని పేర్కొన్నారు. దీనిపై స్పందించి ప్రతి నెల మండల నిల్వ కేంద్రం వద్ద సరకులను తూకం వేసి డిపోలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మేన్స్ సంఘం అధ్యక్షుడు బైడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

8 గ్రామాలకు అంధకారం నుంచి విముక్తి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలంలోని మూడు రోజులగా అంధకారంలో మగ్గుతున్న విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేశారు. '8 గ్రామాల్లో అంధకారం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం వెలువడినన వార్తకు ఈపీడీఈఎల్ సిబ్బంది స్పందించారు. ఈ సందర్భంగా గాలికొండ, జంపర్లోవ, బత్తునూరు, బూసుకొండ, బూడిదేవులు, పాత్రునిగుంట, పాలసెలక గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

'పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి'

ముంచంగిపుట్టు, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్బూరులో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌తో వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని, మౌలిక సదుపాయాలు కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇన్ని సమస్యలతో తమ పిల్లలు ఇబ్బందులు పడతున్నా యాజమాన్యం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వారంలోపు తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు.

కలపాకలో మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్

పరవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపాకలో ఆర్‌వో ప్లాంట్ మూలకు చేరింది. గ్రామస్థులకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 1500 మంది దీనిని వినియోగించుకునేవారు. పంచాయతీ అధికారులకు దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఇరవై లీటర్ల క్యాన్ ఐదు రూపాయలకే విక్రయించేవారు. ప్రస్తుతం ఇది కొన్నేళ్లుగా మరమ్మతులకు గురై మూలకు చేరినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. గత్యంతరం లేక స్వచ్ఛమైన తాగునీటి కోసం సమీపంలో గల గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పంచాయతీ అధికారులు దీనిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి

» ఇతర రాష్ట్రాల వారికి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వివరాలు తెలసుకోవాలి
» గంజాయి విక్రయించినట్టు తెలిస్తే సమాచారం ఇవ్వండి
» డీఎస్పీ షేక్ షహబాజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ షహబాజ్

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ కోరారు. గంజాయి సాగు, రవాణా, అమ్మకం, వినియోగాలు వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం మండలంలోని గుత్తులపుట్టు గ్రామ సచివాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు జిల్లాలో తగ్గినప్పటికీ సరిహద్దు రాష్ట్రాల నుంచి మైదాన ప్రాంతాలకు స్మగ్లర్లు ముంచంగిపుట్టు, పెదబయలు, పాడేరు మీదుగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు ఈ ప్రాతంలో నివాసముంటున్న కొంత మంది తమిళనాడు, కేరల తదితర రాష్ట్రాలకు చెందిన వారు సహకరిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఎవరైనా గంజాయి రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా ఇతర రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చి గ్రామాల్లో వ్యాపారాలు సాగించే వారి పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఇళ్లు, షాపులు అద్దెకు ఇవ్వవద్దని అన్నారు. గంజాయి వినియోగిస్తే ఆరోగ్యం చెడిపోవడంతో పాటు వారి కుటుంబం నాశనమయ్యే ప్రమాదం ఉన్నదని యువతకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలోనే 'గంజాయి వద్దు బ్రో- ఆరోగ్యమే ముద్దు' అంటూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలపారు. గంజాయి రవాణా, అమ్మకాలకు ఎవరైనా సహకరిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తులపుట్టు గ్రామస్థులు, సీఐ డి.దీనబంధు, ఎస్‌ఐ ఎల్.సురేశ్, సచివాలయ కార్యదర్శి పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థులు దొరికారు

» వేకువజామున ఏకలవ్య పాఠశాల నుంచి వెళ్లిపోయిన ముగ్గురు బాలురు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

అరకులోయ/పెదబయలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెదబయల్ మండలంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పరదాని అరవింద్, బడ్నాయిన సాయితేజ, మర్రి అశోక్ ముగ్గురు విద్యార్థులు మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలోని పాఠశాల నుంచి బయటకు వచ్చేశారు. విద్యార్థులు పాఠశాలలో లేకపోవడంతో వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం అందించి, పెదబయలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలు మేరకు డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ ఆధ్వర్యంలోని పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి, విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా విద్యార్థుల ఫొటోలను షేర్ చేయడంతో అరకు సంతబయలుకు చెందిన కార్పెంటర్ కె.సుబ్రమణ్యం ముగ్గురు విద్యార్థులను గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ షెహబాజ్ అహ్మద్ విలేకరులతో మాట్లాడుతూ హుకుంపేట మండలానికి చెందిన అరవింద్, సాయితేజ, అశోక్ పెదబయల్ మండలంలోని ఏకలవ్య పాఠశాలలో పదోవ తరగతి చదువుతున్నారు. చదువుపై ఇష్టంలేకనే పాఠశాల నుంచి పారిపోయినట్టుగా వారు చెప్పారు. పెదబయల్ నుంచి పాడేరు మీదుగా అరకు సంతబయలులో బంధువుల ఇంటికి ముగ్గురు వచ్చారని తెలిపారు. విద్యార్థుల ఆచూకి తెలిపిన కె.సుబ్రహ్మణ్యాన్ని అభినందించి, రివార్డును అందించారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలను జయప్రదం చేయాలి

» డీఈవో పి.బ్రహ్మాజీరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో పి.బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడేరులో శుక్రవారం నిర్వహించనున్న డివిజన్ స్థాయి కీడ్రా పోటీలను విజయవంతం చేయాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆర్చరీ పోటీలకు అన్ని పాఠశాలలను మమేకం చేస్తూ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అండర్ 14, 17, 19 ఆర్చరీ పోటీల్లో అర్హత పత్రాలను తరవుగా తనిఖీలు చేయాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క క్రీడాకారుడు నష్టపోకుండా చూడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలతాదేవి ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించరు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, అనస్థీషియా విభాగం హెచ్‌వోడీ సతీశ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉషారాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ కొరారు. 8వ పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా బుధవారం మినుములూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ మహా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ ద్వారా అందించే పౌష్టికాహారంలో లభించే పోషకాల గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్ లేక అవస్థలు

జి.మాడుగుల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాల పంచాయతీ పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సరిగా రాకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కొన్ని రోజులుగా నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో సచివాలయంలో వివిధ పౌర సేవలకు ఆటంకం కలిగిందని సర్పంచ్ జి.పద్మా ఆవేదన వ్యక్తం చేశారు.

నడిరోడ్డుపై వివాహిత హత్య

» ఎదురింట్లో ఉండే వ్యక్తి ఘాతుకం
» విచక్షణ కోల్పోయి పదునైన ఆయుధంతో పీక కోసేసిన నిందితుడు

విశాఖపట్నం/అక్కయ్యపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టపగలు నడిరోడ్డుపై ఒక వివాహిత హత్యకు గురైంది. ఆమె నివాసానికి ఎదురు ఇంట్లో ఉండే వ్యక్తే పదునైన ఆయుధంతో గొంతుకోసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే హత్య జరగడంతో ఆ ప్రాంతంలో తీవ్రకలకలం రేపింది. అక్కయ్యపాలెం నందగిరి నగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రావణ సంధ్యారాణి అలియాస్ సోనూ (32) నందగిరి నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటుంది. సోనూకు ఎనిమిదేళ్ల వయస్సు గల ఇద్దరు (కవలలు) కుమారులు ఉన్నారు. ఇద్దరూ మానసిక వైకల్యంతో పుట్టడంతో శ్రావణ సంధ్యారాణి భర్త ఆమెను, పిల్లలను వదిలేసి వెళ్లిపోయాడు. దీనిపై ప్రస్తుతం ఇద్దరి మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. శ్రావణ సంధ్యారాణి తండ్రి విశ్వేశ్వరరావు పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన తర్వాత మృతిచెందగా, తల్లి కూడా కొన్నాళ్ల క్రితం మృతిచెందారు. శ్రావణ సంధ్యారాణి ఒక కుమారుడిని హాస్టల్‌లో చేర్పించగా, మరొక కుమారుడు ఆమెతోనే ఉంటున్నాడు. ఇదిలావుండగా శ్రావణ సంధ్యారాణికి, ఆమె ఎదురింట్లో ఉంటున్న కార్పెంటర్ కండిపల్లి శ్రీనివాసరావు(36)కు కొద్దిరోజులుగా గొడవ జరుగుతోంది. బుధవారం మధ్యాహ్నం కూడా ఇద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. సాయంత్రం 5.15 గంటల సమయంలో శ్రావణ సంధ్యారాణి వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. కొద్దిఅడుగుల దూరం వెళ్లేసరికి కొండమ్మ అనే మహిళ ఎదురుపడడంతో ఆమెతో మాట్లాడుతోంది. ఇంతలో వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు పదునైన ఆయుధంతో శ్రావణ సంధ్యారాణి మెడ కోసేశాడు. దీంతో ఆమె తీవ్రరక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది.




శ్రావణ సంధ్యారాణి (ఫైల్)

సంధ్యారాణితో మాట్లాడుతున్న మహిళ గట్టిగా కేకలు పెట్టింది. స్థానికులు అక్కడకు వచ్చేసరికి శ్రీనివాసరావు పరారైపోయాడు. స్థానికులు డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఫోర్త్ టౌన్ సీఐ సీహెచ్ ఉమాకాంత్ అక్కడకు చేరుకుని 108కి ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంధ్యారాణికి ఒక సోదరుడు ఉన్నప్పటికీ అతను అనారోగ్యంతో బాధపడుతున్నట్టు తెలిసింది. తమ అనేవారు ఎవరూ లేకపోవడంతో బుద్ధిమాంద్యం కలిగిన ఇద్దరు కవలల పరిస్థితి ఏమిటనేది అగమ్యగోచరంగా మారింది. వారిని తండ్రి వద్దకు చేర్చేలా పోలీసులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ గిరిజనుడి మృతి

» సకాలంలో వైద్య సేవలు అందకే మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆరోపణ



ఆదినారాయణ(ఫైల్)

ముంచంగిపుట్టు, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నివాసముంటున్న టొంగి ఆదినారాయణ(52) అనే వ్యక్తి సీహెచ్‌సీలో వైద్య పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సకాలంలో వైద్యులు సేవలు అందించపోవడం, మెరుగైన వైద్యం అందించడం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సకాలంలో రాకపోవడం, ఉన్న అంబులెన్స్ మరమ్మతులకు గురికావడం వల్లే ఆదినారాణ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యులు, సిబ్బంది వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఇందిరా కాలనీకి చెందిన ఆదినారాయణకు రెండు కాళ్లు పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి మంగళవారం ప్రైవేటు వాహనంలో తీసుకువెళ్లారు. సీహెచ్‌సీ వైద్యాధికారి గీతా గాయత్రి వైద్య సేవలు అందించారు. ఆదినారాయణ పరిస్థితి విషమంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు కోసం సీహెచ్‌సీ అంబులెన్స్‌ను సంప్రదించగా అది మరమ్మతులకు గురైందని తెలిపారు. దీంతో 108కు ఫోన్ చేశామని, వాహనం వచ్చేందుకు సమయం పడుతుందని అంబులెన్స్ అధికారులు చెప్పారని ఆదినారాయణ కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి సమయంలో వైద్యులు అందుబాటులో లేరు. ఉదయం 5 గంటల సమయంలో వైద్యాధికారి సీహెచ్‌సీకి వచ్చారు. కానీ అప్పటికే ఆదినారాయణ పరిస్థితి మరింత విషమంగా మారి తెల్లవారు జామున మృతి చెందాడు.

టపాసుల విక్రయానికి అనుమతులు తప్పనిసరి

» జీకేవీధి సీఐ వరప్రసాద్



సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా అనుమతులు లేకుండా బాణాసంచా అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని జీకేవీధి సీఐ వరప్రసాద్ హెచ్చరించారు. బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణాసంచా తయారీ గానీ, దుకాణాల్లో అమ్మకాలు జరపవద్దని పేర్కొన్నారు. దీపావళి సామానాన్ని ఎవరైనా అమ్మాలని అనుకుంటే ఆయా శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

పాఠశాల భవనానికి మరమ్మతులు చేయరూ

» నిట్టాపుట్ట గ్రామస్థులు, జీఎస్‌యూ నేతల విన్నపం



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్థులు జీఎస్‌యూ నేతలు

పెదబయలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంగరం పంచాయతీ నిట్టాపుట్టు ప్రాథమిక పాఠశాల భవనానిన తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, జీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల దగ్గర నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పలువురు జీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ ఈ పాఠశాల భవనాన్ని 20 సంవత్సరాల క్రితం నిర్మించారని, ప్రస్తుతం ఇది రేకులు ఊడిపోయి శిథిల స్థితిలో ఉన్నదని అన్నారు. ఈ భవనంలోనే 32 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారి విద్యాభ్యాసానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విద్యార్థులు తరగతులకు హాజరు అవుతున్నారని చెప్పారు. అలాగే మరుగుదొడ్ల పై కప్పు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలుమార్లు విద్యాశాఖ అధికార్లకు విన్నవించినా ప్రయోజన శూన్యమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లింద్రులు, జీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రంతతోనే సంపూర్ణ ఆరోగ్యం



చేతుల పరిశుభ్రంపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

హుకుంపేట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్టేనని మాన్సీ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని గర్దపల్లి గ్రామంలోని బుధవారం అమెరికన్ ఇండియాన్ ఫౌండేషన్ అధ్వర్యంలోని ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది కలిసి గ్రామంలో 'చేతుల పరిశుభ్రత దినోత్సవం'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల దగ్గరి నుంచి పెద్దవాళ్ల వరకు పని చేసిన వెంటనే కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అప్పుడే క్రిములు దూరంగా ఉంటాయని, వాధ్యుల భారిన పడకుండా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంలు, ఆశ వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కళాశాలలో సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ సరస్వతి దేవి, మహాత్మగాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కాసీతమ్మ విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మోదకొండమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయలో నిర్వహిస్తున్న అన్నసమారాధనకు సరకులను, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న వాసవీమాతను దర్శించుకుని బీరువాను బహూకరించారు. అలాగే ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొలువైన ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, గుడికి స్టీల్ గేట్లను వితరణ చేశారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళి



అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనంతగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలగెడ్డ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని బుధవారం ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హెచ్‌ఎం నోకుల దాస్ మాట్లాడుతూ విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అబ్దుల్ కలాం చేసిన కృషి ఎనలేనిదని, పట్టుదలతో పేదరికాన్ని జయించారని విద్యార్థులకు వివరించారు. క్రమశిక్షణ, దేశభక్తి, ఒక మంచి లక్ష్యంతో విద్యార్థులు చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సర్వీసెస్‌పై అవగాహన

డుంబ్రిగుడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధాయులకు యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యాంలో బుధవారం మండల అధ్యక్షుడు, బాలకృష్ణ, కన్నయ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు సేవా భావంతో పనిచేసి గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సర్వీస్ సంబంధిత విషయాల్లో అవగాహన కల్పించారు.

జీసీసీ జూనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలంలో జీసీసీ బ్రాంచిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.వీరభద్రరావుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించినట్టు జీసీసీ డీఎం కల్పనా కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీసీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించిన ఘనత డీఎం కల్పనాకుమారికే దక్కుతుంద న్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

... 7వ పేజీ తరువాయి

స్థానికులు అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని ఎస్పీ అమిత్‌బర్ధార్ సూచించారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు జిల్లాలో ప్రవేశించి, ఒడిశాలోని గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఆశ్రయం కల్పించడం, సహాయం చేయడం వంటివి వద్దన్నారు. జిల్లాను గంజాయి రహితం చేయాలనే లక్ష్యంతో యంత్రాంగం ఉందని, అందుకు అందరూ సహకరించాలని, గంజాయి సాగు, రవాణాకు పాల్పడవద్దన్నారు. అలాగే స్మగ్లర్ల ఆస్తులను కొనుగోలు చేయడం, వారి అక్రమ పనులకు సహకరించడం చేస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. డీవీఎస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ లో ఉద్యోగాలకు కాలేజీలో కంపెనీ హెచ్ ఆర్ శరత్, అజయ్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వంద మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 48మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ రమణాజీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ ఎస్‌వీ వాసు, వెల్ఫేర్ సొసైటీ మెంబర్ శ్యాంజీ, ప్రిన్సిపాల్ నాయుడు, దొరబాబు, వి.శ్రీను, కృష్ణవర్ధన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


చినపాచిలలో పొలాల నుంచి వరిదుబ్బును తీసుకొస్తున్న గ్రామస్థులు

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):మండలంలో చినపాచిల గ్రామంలో గౌరీ పరమేశ్వరుల అంకుర్పణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రచ్చబండ(పెదరాయి)వద్ద ఏటా ఏర్పాటు చేసి కార్తీ మాసం నెల రోజుల పాటు రోజు ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆనవాయితి. దీనిలో భాగంగా 10 ఏళ్ల లోపు వయస్సు గల బాలికతో గ్రామ పోలి మేరలు దాటి పొలాలనుంచి వరి దుబ్బును తీసుకొచ్చి గౌరీ పరమేశ్వరులను నెలకొల్పారు. మండల టీడీపీ అధ్యక్షులు కోమటి శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముచ్చకర్ల సూరిబాబు, కరెడ్ల దుర్గునాయుడు, సానుబిల్లి కృష్ణారావు, కన్నబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం సీతయ్యపేట జడ్పీ హైస్కూల్‌లో మండల కోఆర్డినేటర్ కుంచం బాలగణపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 17,18తేదీల్లో సీతయ్యపేట హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్న కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ అండర్ 14, అండర్ 17 విభాగాలలో ఎంపికలు నిర్వహిమని బాలగణపతి ఈ సందర్భంగా తెలిపారు. బాలురకు 17న, బాలికలకు 18 న ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమములో ప్రధానోపాధ్యాయులు ఎ.సురేశ్, మాట్లాడుతు మండలంలో అన్ని పాఠశాలలనుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. మండలంలో అన్ని హైస్కూళ్ల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోడవరం: మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 17,18 తేదీలలో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడాసారథి బి.కన్నంనాయుడు, ఎస్. అప్పలనాయుడులు తెలిపారు.ప్రతిభ కనపరచిన విద్యార్థులు డివిజన్, ఆ పై జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు.

రావికమతం:ఈనెల 17 నుంచి18 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించ నున్నామని స్థానిక జడ్పీ హైస్కూల్ పీఈటీ కె. ధనుంజయరావు తెలిపారు. కబాడీ, కోకో, వాలీబాల్, సెటిల్‌బ్యాట్‌మెంట్,చెస్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

మద్యం నాణ్యత నిర్ధారణకు సురక్ష యాప్: ఎక్సైజ్ సీఐ


ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు

చోడవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఎక్సైజ్ సురక్షా యాప్‌ను వినియోగదారులు ఉపయోగించుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు బుధవారం తెలిపారు. దుకాణంలో సీసీ బాటిల్ మూతపై ఉన్న హీల్ లేదా క్యూ ఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసి మద్యం తయారైన తేదీ, ఏ డిపో నుంచి వచ్చింది తదితర పూర్తి వివరాలు లభ్యమవుతాయని చెప్పారు. దీని వల్ల నాసిరకంగా కాదో తెల్సుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్టు చెప్పారు. దీనిపై వినియోగదారులకు ఎలాంటి సందేహాలున్నా స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి పూర్తి సమాచారం పొందవచ్చని సీఐ వివరించారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ర్యాలీ



మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే బుధవారం నిర్వహించారు. పెదబొడ్డేపల్లిలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీవో రమాదేవి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, పరిసరాలు పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. భోజనం చేసే ముందు పిల్లలు చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంతోమందికి రాజకీయ భిక్ష పెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే

▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, టీడీపీ నాయకులు

చీడికాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతోమంది నాయకులకు రాజకీయభిక్ష పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని బి.సింగవరం, అప్పలరాజుపురం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటుచేయడం ఆనందదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1982లో తెలుగుదేశం పార్టీ ఏర్పాటుచేసి రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ కంకణం కట్టుకున్నారు. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారాలోకేశ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. 2029 ఎన్నికల్లోను దేశ ప్రధానిగా నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నపుడే మరింత ప్రగతి సాధ్యమన్నారు. కోనాం నుంచి వీఆర్‌ఆర్.పేట రోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్ పదవులు టీడీపీ మద్దతుదారుల గెలుపునకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే బి.సింగవరం గ్రామంలో కల్యాణమండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్‌బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, గూనూరు మల్లునాయుడు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడులు మాట్లాడారు.

టీడీపీ నాయకుడు శ్రీనుకు ఘన నివాళి

అప్పలరాజుపురానికి చెందిన టీడీపీ నాయకుడు కురచా శ్రీను ఇటీవల మృతిచెందడంతో ఆయన మృతికి కొంతసేపు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురచా శేషు, గవిరెడ్డి శ్రీను, కురచా సురేష్, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు గవిరెడ్డి జగన్నాధం, శరగడం శివ, గాడి చెల్లంనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరగడం లక్ష్మి, నాయకులు పంచాడ దాలెంనాయుడు, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, గండి ముసలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెం కాలనీలో సర్వేపై ఆందోళన

▸ పునరావాసం కల్పించిన 17ఏళ్ల తర్వాత చేపట్టడడంతో కాలనీవాసులు అసహనం


అధికారులను ప్రశ్నిస్తున్న తామరం పీఏసీఎస్ డైరెక్టర్, బాధితులు

మాకవరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపాలెం ఆర్‌ఆర్ కాలనీలో సర్వే చేయడంపై నిర్వాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ఏర్పాటుచేసి గత 17ఏళ్లలో సర్వే చేపట్టలేదని.. ఇప్పుడే ఎందుకు సర్వే చేస్తున్నారంటూ అనుమానం వ్యక్తంచేస్తున్నారు.మండలంలో 2007 అన్‌రాక్ భూసేకరణలో ఈ ప్రాంతంలో కొత్తపాలెం, దర్మవరం, జి.వెంకటాపురం, జి.కోడూరు, రాచపల్లి, రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి గ్రామాల్లో సుమారు 2,450 ఎకరాల భూసేకరణ చేశారు. అయితే, కొత్తపాలెంలో భూములు ఇళ్లు కోల్పోవడంతో 2010లో తామరం రెవెన్యూలో సుమారు 150 ఎకరాల ప్రభుత్వ భూమిలో 145మందికి పునరావాస కాలనీ కల్పించారు. అయితే, అప్పట్లో కొంతమందికి ఇళ్లను నిర్మించారు. మరికొంత మంది స్థలాలను ఖాళీగా ఉంచుకుని బతుకు తెరువు కోసం ఇతర జిల్లాలకు వలస వెళ్లిపోయారు.అయితే ఇక్కడ పలు మార్లు కొంత మంది తహశీల్దార్లు ఫోర్జరీ సంతకాలు సృష్టించి కొన్ని స్థలాలు కాజేశారు. పత్రికల్లో కథనాలు వచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. అయితే, ఈ కాలనీ మెడికల్ కాలేజీకి అనుకుని ఉండటం, కూటమి ప్రభుత్వం కళాశాల పనులు ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఈకాలనీపై కొందరు పెద్దలు కన్ను వేశారు. దీంతో అధికార బలం చూపి ఇళ్ల స్థలాలను సర్వే చేయిస్తున్నట్టు ఇక్కడ ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం కాలనీలో సర్వే సమాయత్తం కావడంపై ఆందోళన వ్యక్తంచేశారు. సర్వే ఎవరు చేయమన్నారు.. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నాటి నుంచి నేటి వరకూ దరఖాస్తులు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఇంత హఠాత్తుగా సర్వే ఏమిటని రెవెన్యూ సిబ్బందిని తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు అడిగర్ల రాంబాబు ప్రశ్నించారు. ఆర్‌డీవో, తహసీల్దార్ సర్వేకు ఆదేశించిన రెవెన్యూ సిబ్బంది సమాధానం ఇచ్చారు.

'వారసత్వ భూమికి హక్కులు కల్పించాలి'

మాకవరపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారసత్వం ద్వారా వచ్చిన భూమికి హక్కులు కల్పించాలంటూ సన్నిది శ్రీనివాసరావుతో పాటు మరో 20మంది నాయీ బ్రహ్మణ మహిళలు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల తామరం 61/3 సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని రాచపల్లి గ్రామానికి చెందినవారు ఆక్రమించేందుకు ప్రయత్నించగా, రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి రాచపల్లి గ్రామానికి చెందిన పేరయ్య అనే వ్యక్తి సాగుచేసేవారని, ఈ భూమి తమది అంటూ కొందరు వ్యక్తులు బుధవారం భూమిలోకి వెళ్లారు. దీంతో భూమిలో పూర్వ నుంచి తామే సాగులో ఉన్నామని నాయీ బ్రహ్మణులు అన్నారు. హక్కులు కల్పించాలని తహసీల్దార్ బి.వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బోంతురమణ పాల్గొన్నారు.

బత్తులకు సత్యసాయి జయంతి వేడుకల ఆహ్వానపత్రిక

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదిలో శ్రీ సత్యసాయి జన్మదినవేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికను టీడీపీ నేత బత్తుల తాతారావుకు జోన్- 5 ఇన్‌చార్జి బి లోవరాజు ,టి నూకరాజు భగవాన్ మస్తారు, ఎస్ నాగరాజు బుధవారం అందచేశారు. నవంబర్23న జరిగే సాయిబాబాజయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

పశువులకు గర్భకోశ వైద్య పరీక్షలు

దేవరాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వంద పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్టు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.రామ్మోహన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ దూడలు మాత్రమే పుట్టేలా లింగ నిర్ధారణ వీర్యం(ఎస్.ఎస్ఎస్) అందుబాటులో ఉందన్నారు. కెకోటపాడు ఏడీ దినేష్‌కుమార్, పశు వైద్యాధికారులు సౌజన్య, మంజుషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి రుణాలు మంజూరు


రైతులకు రుణాలు అందచేస్తున్న చైర్‌పర్సన్ కోట సత్యనారాయణ

బుచ్చెయ్యపేట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురకలపూడి పీఏసీఎస్‌లో బుధవారం రైతులకు పెట్టుబడికి రబీ సీజన్‌కు వీలుగా రుణాలు మంజూరు చేశారు. చైర్‌పర్సన్ కోట సత్యనారాయణ 15 మందికి రూ. 20 లక్షలు అందించారు. మరో 30 లక్షలు మార్ట్‌గేజ్ ద్వారా భూములు తనఖా పెట్టురేపి రుణాలు మంజూరు చేసారు. ఈ కార్యక్రమంలో రావికమతం బ్రాంచి మేనేజర్ కరణం నారాయణమూర్తి , ఫీల్డ్ ఆఫీసర్ శ్రీను, తురకలపూడి పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

గొలుగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : నర్సీపట్నం సీడీపీఓ రమణ బుధవారం రామలక్ష్మీపురంలో ఒకటి, పెదబొడ్డేపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అందిస్తున్న సేవలను పరిశీలించారు. హోమ్‌విజిట్ చేసి గర్భిణు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి: పీడీ


15కేకేపీ-2- కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పూర్తి స్థాయి పనుల కల్పనకు వీలుగా గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ - ప్రజా వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని చంద్రయ్యపేట, కె. సంతపాలెం, ఆర్లే, ఆనందపురం, ఏ భీమవరం, ఎల్‌వీ పాలెం, దాలివలస గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2024-25లో రూ. 22 కోట్లతో 1392 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో 1154 పనులు గ్రామాల్లో చెరువులు, కాలువలు తదితర మట్టి పనులు పూర్తి చేసినట్టు చెప్పారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ. 6.25 లక్షలతో 19 పనులు, సామాజిక అటవీ పథకంలో 10 నర్సరీలకు రూ. 25 లక్షలు, పాఠశాలల ప్రహరీలకు రూ. 85 లక్షలతో 37 పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ విజిలెన్స్ అధికారిణి దేవి శ్రీలలిత, ఎస్డీఎం సత్యనారాయణ, ఎస్ఆర్పీ చిరంజీవి, స్థానిక ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు


వూషు పోటీలలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వూషూ పోటీలలో సోషల్ వెల్ఫేర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. మంగళ, బుధవారాలలో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల వూషూ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అంబేడ్కర్ గురుకులానికి చెందిన పరవాడ జోష్నమేరి, వేంపేటి ప్రణీత స్వర్ణ పతకాలు సాధించారు. పెంట దుర్గా భవాని సిల్వర్ మెడల్, వెన్నెల కావ్య బ్రాంజ్ మెడల్ సాధించినట్టట శాప్ కోచ్ అబ్బు తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు నెలాఖరులో మణిపూర్‌లో జరిగే 69వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వాకర్స్

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఎంఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, అంతరిక్ష పరిశోధన సంస్థలో అబ్దుల్ కలాం ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. యువత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎంవీ రంగారావు, ట్రెజరర్ అల్లు అప్పారావు, ఆళ్ళ వరప్రసాద్, లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

మాడుగుల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొంగలిపాక గ్రామంలో బుధవారం కూటమి నాయకులు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఇంటింటికి, చిరు వ్యాపారులకు వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు, కూటమి నాయకులు సత్తిబాబు, జోగినాయుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోనాం రేషన్ డిపోపై 6ఏ కేసు నమోదు

చీడికాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాం రేషన్ డిపోపై 6ఏ కేసు నమోదుచేసినట్టు సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ రవిబాబు తెలిపారు.మంగళవారం సాయంత్రం ఈ డిపోను స్థానిక వీఆర్‌వో లక్ష్మీకుమార్‌తో కలిసి తనిఖీచేయగా 625కిలోల బియ్యం, 49పంచదార ప్యాకెట్లు అదనంగా ఉన్నాయన్నారు. రికార్డుల్లో లోపాలను గుర్తించామన్నారు.దీనిపై 6ఏ కేసు నమోదు చేసి, మంచాల రేషన్‌డిపో డీలర్ కె.హేమసుందర్‌కి ఇన్‌చార్జిగా నియమించామని ఆయన తెలిపారు.

బాణసంచా దుకాణాలకు 38 దరఖాస్తులు


పెద్దచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : బాణ సంచా దుకాణాలకు 38 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ లోకవరపు రామారావు తెలిపారు. బుధవారం ఆయన నర్సీపట్నంలోని పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా తనిఖీ చేశారు. ఫైర్‌ఆఫీసర్ అప్పలస్వామి దుకాణాల ఏర్పాటులో తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టైన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ఆర్ఐ నాయుడు పాల్గొన్నారు.

కాలువకు గండి, నీట మునిగిన పంటలు


కలిగొట్ల వద్ద కాలువకు గండి

దేవరాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు నీరందించే కుడి ప్రధాన కాలువకు సోమవారం అర్ధరాత్రి గండి పడింది. దీంతో పదిఎకరాల్లో వరి, సరుగుడు తదితర పంటలు ముంపునకుగురయ్యాయి. తారువ ఆనకట్ట వద్ద ఏర్పాటు చేసిన మదుం ద్వారా దిగువ ఆయకట్టుకు ఈ కాలువద్వారా 50 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు. ఈ ఆనకట్టకు అర కిలోమీటరు దూరంలో కాలువ ఎడమ గట్టుకు సుమారు 50 మీటర్ల బారీ గండి పడింది. దీంతో ఈ నీరంతా కాలువ ఆనుకొని ఉన్న పొలాలు ముంచేసింది. మరికొంత శారదానదిలో కలిసిపోతోంది.జ జలవనరుల శాఖ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.


నీటితో మునిగిన పొలాలు

ఆర్థిక ఊబి నుంచి అభివృద్ధి పథంలోకి..

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడంతోపాటు అభివృద్ధి పథంలో సాగేలా ముందుకు నడిపిస్తోందని ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని ఎమ్మెల్యే బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గుడ్డిపలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి భూమి పూజ చేశారు. మండలంలో వివిధ గ్రామాల్లోని 24 మంది పక్కా గృహ లబ్ధిదారులకు ఫ్యాన్లు, ఎల్‌ఈడీ బల్బులు ఎంపిపీ పైల రాజుతో కలసి పంపిణీ చేశారు. రూ. 1.16 కోట్లతో నూతనంగా నిర్మించిన సివిల్ సప్లైయి గోదాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామానికి రూ.1.24 కోట్లతో నిర్మించనున్న కిలో మీటరున్న తారురోడ్డు నిర్మాణ పనులను అయన ప్రారంభించారు. గర్నికం కేజీబీవీలో అదనంగా రూ.69 లక్షలతో ల్యాబ్ రూమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గర్నికం సివిల్ సప్లై గోదాం వద్ద ఏర్పాటు చేసిన సమావేశాంలో ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వం దీనిని పూర్తి చేయలేదన్నారు. పదేళ్ళ తరువాత మళ్లీ ఈ గొడౌన్‌ను పూర్తి చేసి, తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉందన్నారు. ఈ గోదాం చుట్టూ లారీలు తిరిగేలా కేటాయించిన స్థలం హద్దులు నిర్ధారణ చేయాలని, ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, వేపాడ నాగేశ్వరావు డీలర్ల సంఘ అధ్యక్షులు కోట గోవిందరావు, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ పి. జయంతి, ఎంపీడీవో మహేష్, తహసీల్దార్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోతున్నాయని, ఈస్థితిలో భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదేనని మాడుగుల నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు అన్నారు. బుధవారం కె.కోటపాడు రెల్లివీధిలో ఏర్పాటు చేసిన ఓట్ చోరీ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యేసు రాజు, కె. కోటపాడు, చీడికాడ మండలాల నాయకులు వడ్డాది కోటేశ్వరరావు, పరదేశి, కార్యకర్తలుపాల్గొన్నారు.

దేవరాపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీ అవగాహన సంతకాల సేకరణ బుధవారం జరిగింది. సుమారు వంద మందిని కలసి సంతకాల సేకరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జి పడాల్ కొండలరావు, మండల అధ్యక్షుడు బంగార్రాజు, నాయకులు కోటి, పరిదేశి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అక్రమాలపై విచారణ వేగవంతం చేయండి


చైర్‌పర్సన్ బలిజి మహారాజ్‌తో సమావేశమైన రైతులు

రోలుగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై విచారణ వేగవంతం చేయాలని చేచచల చేసంఘ సభ్యులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొల్లునారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు,పి.శ్రీనివాసరావు తదితరులు ఛైర్‌పర్సన్ బలిజి మహారాజ్‌ను కోరారు. బుధవారం పీఏసీఎస్‌లో సమావేశమయ్యారు. గతంలో జరిగిన నిధుల స్వాహాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గత జనవరిలో ఆయన ఆదేశాలిచ్చినా విచారణ జరపకుండా మధ్యలోనే నిలిపివేశారన్నారు. సస్పెండ్ అయిన పూర్వ సీఈఓపై చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

గొలుగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం పాకలపాడు హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ డి. సత్యవతి మాట్లాడారు. లింగ నిర్ధారణ జరగకుండా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వివరించారు.